ప్రజలే న్యాయ నిర్ణేతలు..


మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- అవినీతి ఆరోపణలు రుజువు చేస్తే రాజకీయాలకు స్వస్తి చెబుతా
- ఓట్ల కోసం అశోక్ దిగజారుడు వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదం
- శంఖారావం సభలో నారా లోకేశ్‌వి అవగాహన లేని ఆరోపణలు
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: ప్రజాస్వామ్యంలో ప్రజలే న్యాయ నిర్ణేతలని.. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రాజకీయ లబ్ధికోసం దిగజారి తప్పుడు ఆరోపణలు చేస్తే ప్రజలు నమ్మే పరిస్థితి లేదని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. శుక్రవారం జరిగిన టీడీపీ శంఖారావం సభలో నారా లోకేష్‌తో పాటు కేంద్ర మాజీ మంత్రి పి.అశోక్‌గజపతిరాజు, అధితి గజపతిరాజు, జనసేన నాయకురాలు పాలవలస యశస్వి తనపై చేసిన తప్పుడు ఆరోపణలను ఖండించారు. కేంద్రాస్పత్రి జంక్షన్ వద్దగల వైఎస్సార్‌సీపీ జోనల్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, విజయనగరం ఎమ్మెల్యే గంజాయి వ్యాపారం చేస్తున్నారంటూ చేసిన ఆరోపణలను నిరూపించగలరా అని సవాల్ విసిరారు. తనపై చేసిన ఆరోపణలు నిజమైతే ఓటు వేయవద్దని ప్రజలను కోరుతానని.. ఆరోపణలు వాస్తవం కాకపోతే ఓటు వేయొద్దని టీడీపీ నాయకులు ప్రజలకు చెప్పగలరా అని నిలదీశారు. నారా లోకేశ్‌కు ఎలాగూ బుద్ధి లేదని, కనీసం స్క్రిప్ట్ రాసిన వారైనా సమాధానం చెప్పగలరా అని ప్రశ్నించారు. గుంకలాం, సారిక గ్రామాల్లో రైతుల నుంచి భూములు కొనుగోలు చేసి ప్రభుత్వానికి అమ్మకం చేశామంటూ తప్పుడు ప్రచారం చేయడం అశోక్‌గజపతిరాజు అవగాహన లేమిగా పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో అన్ని పార్టీలకు చెందిన రైతుల వద్ద భూములు కొనుగోలు చేశామని అందులో ఒక్క రైతైనా తన పేరుపై, తన కుటుంబ సభ్యుల పేరుపై విక్రయించినట్లు నిరూపిస్తే విజయనగరం జిల్లా ప్రజల ఆరాధ్యదైవం పైడితల్లిపై ప్రమాణం చేసి రాజకీయాల నుంచి వైదొలుగుతానని చెప్పారు. టీడీపీ నేతలకు దమ్ముంటే చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని చెప్పి ఓట్లు అడగాలే తప్ప అవాస్తవాలు చెప్పుకుని రాజకీయ లబ్ధి పొందాలనుకోవడం తగదన్నారు.

మీరేం చేశారో చెప్పగలరా..?

యువతలో క్రీడాస్ఫూర్తిని నింపేందుకు 64 ఏళ్ల వయస్సులో జలాసనం వేయడాన్ని కూడా వ్యంగ్యంగా మార్చడం అశోక్ గజపతిరాజుకు తగదని కోలగట్ల అన్నారు. రానున్న ఎన్నికల్లో మా ప్రభుత్వ పాలనలో చేసిన అభివృద్ధిని చెప్పి ఓట్లు అడుగుతామని.. అలా మీరు అడగగలరా అంటూ సవాల్ విసిరారు. పలుమార్లు రాష్ట్ర మంత్రిగా, కేంద్రమంత్రిగా పదవులు అనుభవించిన అశోక్ విజయనగరం అభివృద్ధికి ఏం చేశారో చెప్పాలని సవాల్ విసిరారు. విజయనగరంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల, జేఎన్‌టీయూ యూనివర్సిటీ, డిగ్రీ కళాశాల ఏర్పాటు అభివృద్ధి కాదా అని ప్రశ్నించారు. ప్రజలకు అవసరమైన రోడ్లు, కాలువలు, వీధి దీపాల ఏర్పాటు చేయడంతో పాటు తాగునీటి సమస్యలు పరిష్కరించామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ చేసిన అభివృద్ధిని తాము చేశామని టీడీపీ నాయకులు చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. నియోజకవర్గ పరిధిలో ఇసుక రీచ్ లేకపోయినా ఇసుక దందా చేస్తున్నామని ఆరోపించడం వారి అజ్ఞానానికి నిదర్శనమని చెప్పారు. కరోనా సమయంలో విశేష సేవలందించడం వల్లే కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్‌సీపీకి 49 స్థానాలు, టీడీపీకి ఒక స్థానం కట్టబెట్టారని చెప్పారు. బంగ్లాల్లో కూర్చుని అధికార దర్పం ప్రదర్శిస్తే ఓట్లు వేసే రోజులు పోయాయన్నారు. ఇప్పటికైనా టీడీపీ నాయకులు తప్పుడు ఆరోపణలకు స్వస్తి పలికి నిజాయితీగా రాజకీయం చేయాలని సూచించారు. సమావేశంలో నగర మేయర్ వి.విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ ముచ్చు లయాయాదవ్, ఎంపీపీ మామిడి.అప్పలనాయుడు, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, మండల అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, పలు డివిజన్‌లకు చెందిన కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లోకేశ్‌కు విమర్శించే హక్కు లేదు..


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

పూసపాటిరేగ: టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు దొడ్డిదారిన మంత్రి అయిన నారా లోకేశ్‌కు ఎదుటవారిని విమర్శించే హక్కు లేదని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్‌కార్యాలయం వద్ద జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, తన కుమారుడు మణీదీప్‌పై లోకేష్ ఆరోపణలు చేయడం తగదన్నారు. తన తండ్రి రెండెకరాల నుంచి వేల ఎకరాలకు, వేల కోట్ల రూపాయలు ఎలా సంపాదించాడో లోకేష్ ముందు తెలుసుకోవాలని సూచించారు. పదే పదే ఎర్రబుక్కు చూపించడం, కుర్చీ మడతపెట్టినంత మాత్రాన ఎవ్వరూ భయపడరన్నారు. ప్రజా విశ్వాసం కోల్పోయిన టీడీపీని జాకీలతో లేపినా లేవదని ఎద్దేవా చేశారు. రామతీర్థంలో రాముడి విగ్రహం తల నరికించి రాజకీయం చేసిన చంద్రబాబుకు దేవుడే బుద్ధి చెబుతాడన్నారు. కందుల రఘుబాబు భిక్షతో ఒకే ఒక్కసారి ఎంపీపీ అయిన కర్రోతు బంగార్రాజు మరుచటి రోజు నుంచే మాజీ ఎమ్మెల్యే పతివాడపై పోరాటానికి సిద్ధమయ్యాడన్నారు. ఎమ్మెల్యే టికెట్ ఇస్తే 30 వేల మెజార్టీతో గెలుస్తానని చెబుతున్న బంగార్రాజు ముందు సొంతూరు పోలిపల్లిలో తన ఉనికి ఏమిటో తెలుసుకోవాలని హితవు పలికారు. స్థానిక సంస్థల ఎన్నికలలో మీ సోదరుడు సత్యనారాయణ చిత్తుగా ఓడిపోయిన విషయం తెలియదా అని ప్రశ్నించారు. భోగాపురం ప్రాంతానికి బతకడానికి వచ్చిన లోకం మాధవి కులాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయం చేస్తే చూస్తూ ఊరుకోరమన్నారు. గత ఎన్నికలలో నెల్లిమర్లలో పోటీచేసి 7 వేల ఓట్లకే పరిమితమయ్యానన్న విషయం మాధవి గుర్తుంచుకోవాలని సూచించారు. ప్రభుత్వ భూములు ఆక్రమించిన మాధవికి ఇతరులకు బుద్ధులు చెప్పే అర్హత లేదన్నారు.

క్లుప్తంగా

సమ్మెకు సిద్ధంగా ఉండాలి


ధర్నా నిర్వహిస్తున్న ఉద్యోగులు

భోగాపురం: సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే ఉద్యోగులు సమ్మెకు సిద్ధంగా ఉండాలని భోగాపురం తాలుకా జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ కొమ్మూరు దుర్గారావు పిలుపునిచ్చారు. రాష్ట్ర జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు శనివారం ఉదయం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు పూసపాటిరేగ, డెంకాడ, భోగాపురం మండలాలకు చెందిన ఉద్యోగులు, పింఛన్‌దారులు ధర్నా నిర్వహించారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు సూరి అప్పారావు, గణపతిరావు, ఉమాపతి, శరత్‌కుమార్, సీతారాజు, బంగారుబాబు, గురుభక్తులు, ఉద్యోగులు, పింఛన్‌దారులు, తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామక పత్రం అందజేత


పడాల స్వాతికి నియామక పత్రం అందిస్తున్న ఎస్ఈ విజయరత్నం, తదితరులు

విజయనగరం రూరల్: రోడ్లు, భవనాల శాఖ (విజయనగరం) కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్‌గా పని చేసిన పడాల రమేష్‌నాయుడు ఇటీవల మృతి చెందడంతో ఆయన కుమార్తె పడాల స్వాతికి కారుణ్య నియామకంలో భాగంగా ఆర్అండ్‌బీ ఎస్ఈ కె.విజయరత్నం శనివారం నియామకపత్రం అందజేశారు. తక్కువ సమయంలో బాధిత కుటుంబానికి ఉద్యోగం కల్పించిన విజయరత్నంను విజయనగరం జిల్లా ఆర్అండ్‌బీ శాఖ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్, వైఆర్ అనిల్‌కుమార్‌లతో పాటు స్వాతి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

డెంకాడ: మండలంలోని పినతాడివాడ-1 అంగన్‌వాడీ కేంద్రం సహాయకురాలి పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు భోగాపురం సీడీపీఓ ఎస్తేర్‌రాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17వతేదీ నుంచి 24వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు భోగాపురం ఐసీడీఎస్ పీఓ కార్యాలయానికి నేరుగా గాని, రిజిస్టర్ పోస్టు ద్వారా గాని దరఖాస్తులు అందజేయాలని పేర్కొన్నారు. ఆయా పోస్టు ఓసీకి కేటాయించడం జరిగిందన్నారు. 01-07-2023 నాటికి 21 నుంచి 35 మధ్య వయసుండి పదో తరగతి అర్హత కలిగి ఉండాలన్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

భోగాపురం: మండలంలోని మహారాజుపేట కూడలి వద్ద ఎస్ఈబీ సీఐ కె.సురేష్ శనివారం సాయంత్రం వాహన తనిఖీలు చేపట్టగా మద్యం తరలిస్తున్న ఇద్దరు పట్టుబడ్డారు. గుడివాడ, మోదవలస గ్రామాలకు చెందిన బోయ నర్సాయమ్మ, ఎర్నేటి గోవింద్ నుంచి 30 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.

మహిళ అరెస్ట్

భోగాపురం: మండలంలోని మహారాజుపేటలో బెల్ట్‌షాపు నడుపుతూ అక్రమంగా మద్యం విక్రయిస్తున్న అక్కరమాని అప్పయ్యమ్మ అనే మహిళను శనివారం అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సూర్యకుమారి తెలిపారు. ఆమె నుంచి 21 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

నిర్మాణ సామగ్రి పంపిణీపై విచారణ

భోగాపురం: మండలంలోని ముక్కాం జగనన్న లేవుట్‌లో ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు సిమెంట్, ఐరన్ వంటి నిర్మాణ సామాగ్రి ఇవ్వకుండానే ఆన్‌లైన్‌లో ఇచ్చినట్లు అధికారులు చూపిస్తున్నరంటూ కొంతమంది లబ్ధిదారులు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మండల ప్రత్యేకాధికారి సుధారాణి ముక్కాం సచివాలయంలో ప్రజాప్రతినిధుల సమక్షంలో శనివారం విచారణ చేపట్టారు. అయితే ఫిర్యాదు చేసిన లబ్ధిదారుల్లో కొంతమంది మాత్రమే రావడంతో.. జగనన్న కాలనీలోని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి విచారణ చేపట్టి నివేదికలను అందజేయాలని హౌసింగ్ అధికారులను ఆమె ఆదేశించారు.

రిజర్వేషన్ హామీని మేనిఫెస్టోలో చేర్చాలి

- ఉత్తరాంధ్ర తెలగ సంఘ అధ్యక్షుడు చనుమల్ల ప్రసాద్


కలెక్టరేట్ వద్ద మోకాలిపై నిరసన వ్యక్తం చేస్తున్న తెలగ సంఘ నాయకులు

విజయనగరం టౌన్: రానున్న ఎన్నికలలో ఏ పార్టీ అయితే బీసీ రిజర్వేషన్ హామీని మేనిఫెస్టోలో పెట్టి అమలు చేస్తుందో ఆ పార్టీకే తమ పూర్తి మద్దతు ఉంటుందని ఉత్తరాంధ్ర తెలగ సంఘ అధ్యక్షుడు చనుమల్ల ప్రసాద్ స్పష్టం చేశారు. స్థానిక కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న నిరాహార దీక్షల్లో శనివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన తెలగ సంఘ నాయకులతో కలిసి ఆయన మోకాలిపై నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ప్రసాద్ మాట్లాడుతూ.. తెలగ, ఓసీ కాపు, బలిజ, ఒంటరి కులాలన్నీ ఒకటేనని, వాటిని బీసీలో చేర్చాలనే డిమాండ్‌పై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. మరో రెండురోజుల్లో శ్రీకాకుళం, విశాఖ జిల్లల్లో కూడా నిరసనలు వ్యక్తం చేస్తామన్నారు. కార్యక్రమంలో తెలగ సంఘ నాయకులు కాజా సత్యనారాయణ, తాడి నానాజీ, అప్పారావు దొర, సూరాబత్తుల చిట్టిబాబు, కూనిశెట్టి రామారావు, గుగ్గిలాపు నారాయణరావు, పాల శ్రీనివాస్, కూనిశెట్టి లక్ష్మి, రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వితరణ


భోగాపురం:హెచ్‌ఎం శ్రీనివాసరావుకు సీలింగ్ ఫ్యాన్లు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

భోగాపురం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు కొమ్మూరు జగన్ మోహనరావు, ఆళ్ల శేఖర్ పది సీలింగ్ ఫ్యాన్లను వితరణగా అందజేశారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పీఏజీ హెచ్‌ఎఫ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ, పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. గతంలో కూడా కొంతమంది పూర్వ విద్యార్థులు రూ.80 వేల విలువ చేసే ఐరన్ గేట్లను వితరణగా అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ముద్దన శ్రీనివాసరావు, పీడీలు చిన్నారి, బి.రఘు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


డెంకాడ: బూట్లు, సాక్సులు అందుకున్న విద్యార్థులతో యువమంచ్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు

విద్యార్థులకు బూట్లు..

డెంకాడ: విజయనగరానికి చెందిన మార్వాడీ యువ మంచ్ సభ్యులు మండలంలోని పెదతాడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని స్కౌట్ విద్యార్థులకు బూట్లు, సాక్సులు వితరణగా అందజేశారు. యువమంచ్ అధ్యక్షులు మణిశర్మ, సంజీవ్ మాట్లాడుతూ, భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రవిశంకర్, పాఠశాల కమిటీ చైర్మన్ శ్రీరాములునాయుడు, స్కౌట్ ఉపాధ్యాయులు ఎ. శాంతిస్వరూప్, జె. శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్సీ సురేష్‌బాబు


శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు

నెల్లిమర్ల: మిమ్స్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ డాక్టర్ పీవీవీ సూర్యనారాయణరాజు (సురేష్ బాబు) హామీ ఇచ్చారు. పట్టణంలోని ఆర్‌టీబీ వద్ద మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు చేపడుతున్న నిరసన శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు తమ సమస్యలను ఎమ్మెల్సీకి వివరించారు. దీంతో ఆయన స్పందిస్తూ సమస్యలను మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివారావు, మిమ్స్ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు. కార్యక్రమంలో వివిధ యూనియన్ల నాయకులు దవళ లక్ష్మణరావు, కె. సురేష్, యూఎస్ రవికుమార్, టీవీ రమణ, కిల్లంపల్లి రామారావు, ఉద్యోగులు మిరప నారాయణ, కె. కామునాయుడు, ఎం. నాగభూషణం, మధు, మూర్తి, రాంబాబు, బంగారునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు


వలంటీర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, తదితరులు


సమావేశానికి హాజరైన వలంటీర్లు

పూసపాటిరేగ: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. వలంటీర్ల సేవలను ఇతర రాష్ట్రాలు సైతం అభినందిస్తున్నాయని గుర్తు చేశారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సేవారత్న అవార్డుకు ఎంపికైన కుమిలికి చెందిన డొంక సింహాద్రి, కొల్లాయివలసకు చెందిన బుసకల రాంబాబు, కొప్పెర్లకు చెందిన పి. భవానీ, కనిమెల్లకు చెందిన తాండ్రోతి రాధిక, పేరాపురానికి చెందిన వసాది సంతోషిలతో పాటు సేవామిత్రకు ఎంపికైన 421 మంది వలంటీర్లకు ఎమ్మెల్యే సత్కరించి, అవార్డులు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తున్న వలంటీర్లను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. సేవావజ్ర అవార్డులకు ఎంపికైన వారికి రూ. 45 వేలు, సేవారత్నలకు రూ.30 వేలు, సేవా మిత్రలకు 15వేల రూపాయలు చొప్పున ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు చెప్పారు. వలంటీర్లు పారదర్శకంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. వలంటీర్ల ద్వారా ప్రభుత్వానికి మంచిపేరు వస్తుండడంతో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, తదితరులు ఓర్వలేక తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, జెడ్పీటీసీ సభ్యురాలు మహంతి సీతాలక్ష్మి, జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ ఎస్. సత్యనారాయణరాజు, ప్రజాప్రతినిధులు మహంతి జనార్దనరావు, దాడిశెట్టి త్రినాథరావు, బర్రి చినఅప్పన్న, పి. లక్ష్మీనారాయణ, కోట్ల రఘు, పబ్బిరెడ్డి అప్పడుదొర, మొంగం నాగబాబు, దేశెట్టి గణేష్, రౌతు శ్రీరామ్మూర్తి, టొంపల సీతారాం, కొత్తకోట శ్రీరాములు, టి. బాబు, డి.ఈశ్వరరావు, శాంతాటి శ్రీనివాసరావు, ఎంపీడీఓ ఎం. రాధిక, తహసీల్దార్ ప్రవల్లిక ప్రియ, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మాధురి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి

విజయనగరం టౌన్: సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి పూర్తిస్థాయిలో కృషిచేస్తానని ట్రస్ట్ బోర్డు చైర్మన్ రెడ్డి శంకర్‌రెడ్డి తెలిపారు. శంకర్‌రెడ్డిని ఆలిండియా రెడ్డి జేఏసీ జాతీయ అధ్యక్షుడు మారం బాలబ్రహ్మారెడ్డి, ఏపీ స్టేట్ రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ రౌతు భాస్కరరెడ్డి, గుడ్ల బ్రహ్మానందరెడ్డి, రెడ్డి జేఏసీ యూత్ సెక్రటరీ బోర చంద్రశేఖరరెడ్డి, తదితరులు శనివారం కలిసి అభినందించారు. ఈ సందర్భంగా శంకర్‌రెడ్డి మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా రెండోసారి పదవీ బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామికి రుణపడి ఉంటానన్నారు.


సుబ్బారెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, జీసీసీ చైర్‌పర్సన్ డాక్టర్ శోభా స్వాతిరాణి, గుల్లిపల్లి గణేష్, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

అభినందనలు..

సాక్షి ప్రతినిధి, విజయనగరం: రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికకానున్న వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డికి అభినందనలు వెల్లువెత్తాయి. శనివారం విశాఖలోని పార్టీ కార్యాలయంలో పలువురు నాయకులు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సంక్షిప్తంగా...

అప్రమత్తంగా ఉండాల్సిందే...

నెల్లిమర్ల రూరల్: పొడిబారిన కళ్ల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సెంచూరియన్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి సూచించారు. వర్సిటీలో విద్యార్థులకు కళ్ల సమస్యలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు సెల్‌ఫోన్లు, కంప్యూటర్లు అధికంగా వాడుతున్నారని, ఈ కారణంగా కళ్లు వేగంగా అలసటకు గురై పొడిబారుతాయన్నారు. ఫోన్లు, కంప్యూటర్లు ఉపయోగించేటప్పుడు ప్రతి 20 నిమిషాలకోసారి కళ్లకు విశ్రాంతి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నెల్లిమర్ల: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏపీ జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు నెల్లిమర్ల తాలూకా యూనిట్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సంఘం తాలూకా యూనిట్ చైర్మన్ గణేష్, పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు అల్లూరి విశ్వనాథరాజు, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఈశ్వరరావు మాట్లాడుతూ.. పీఆర్సీ అమలు చేయాలని, బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పైడిరాజు, పతివాడ త్రినాథ్, ఏపీయర్రా రమణ, కోశాధికారి ధనుంజయ్, తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ సంక్షేమాధికారికి వినతులు

విజయనగరం టౌన్: జిల్లా మైనారిటీ సంక్షేమాధికారిగా బాధ్యతలు తీసుకున్న సంఘమిత్ర ఆర్ఎస్.జాన్‌ను శనివారం స్థానిక మైనార్టీ కార్యాలయంలో పలువురు క్రిస్టియన్ మైనార్టీ సెల్ ప్రతినిధులు కలిసి వినతులు సమర్పించారు. తమ ప్రాంతాల్లో ఉన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అలాగే బాధ్యతలు చేపట్టిన ఆయన్ను అభినందిస్తూ సత్కరించారు. కార్యక్రమంలో కృపారావు, ఇస్సాక్, సున్నపు ప్రసాద్, విక్టర్ పాల్, రాజు పాల్గొన్నారు.

20న సీఎంసీ వద్ద ధర్నా

విజయనగరం ఫూల్‌బాగ్: మున్సిపల్ పంప్ హౌస్, లీకుల్లో పనిచేసే కార్మికులకు నెలల తరబడి జీతాలు చెల్లించుకుంటే ఎలా బతకాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎ. జగన్ మోహన్ రావు ప్రశ్నించారు. శనివారం స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో ఆయన మాట్లాడుతూ, సమ్మె కాలపు జీతం, సంక్రాంతి కానుక, బకాయి జీతాలు, హెల్త్ అలవెన్సులు మంజూరు చేయాలని కోరుతూ నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు.

సేవలతోనే గుర్తింపు

పూసపాటిరేగ: ఉద్యోగి విధి నిర్వహణలో అందించిన సేవలే గుర్తింపునిస్తాయని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉద్యోగోన్నతి పొందిన దశరథ, మూర్తి, అఖిల్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం. రాధిక, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ ఎస్. సత్యనారాయణరాజు, మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దనరావు, పి. లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు


చిన్నారుల ప్రదర్శన

విజయనగరం అర్బన్: పట్టణంలోని ఫోర్ట్ సిటీ స్కూల్‌లో శనివారం నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. రెండు రోజుల పాటు నిర్వహించనున్న పాఠశాల వార్షికోత్సవాలను పాఠశాల చైర్మన్ కేవీపీ రాజు (శివ) శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆఫ్రికా, మెక్సికో, స్పెయిన్, అమెరికా, జపాన్, కొరియా, బ్రెజిల్, అఫ్ఘనిస్తాన్, తదితర విదేశాల వేషధారణలతో అలరించారు. కార్యక్రమంలో పాఠశాల వైస్‌చైర్మన్ చంటి, ప్రిన్సిపాల్ డాక్టర్ రోయినాఖాన్, డైరెక్టర్లు మధు, అశోక్, నీలిమ, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రథమ చికిత్సపై అవగాహన

విజయనగరం ఫోర్ట్: ప్రథమ చికిత్సపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రెడ్‌క్రాస్ వైద్యుడు వేణుగోపాల్ రెడ్డి అన్నారు. శనివారం స్థానిక రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో ప్రథమ చికిత్సపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. ఆకస్మాత్తుగా ప్రమాదాలు జరిగినప్పుడు, గుండె ఆగినప్పుడు సీపీఆర్ విధానం ద్వారా చికిత్స ఎలా చేయాలో ప్రయోగ పూర్వకంగా వివరించారు.